"నువ్వులు దానం చేసి తైలంతో పూజ చేస్తే శనీశ్వరుడు శాంతిస్తాడంటారు నిజమేనా" సీరియస్‌గా ప్రశ్నించాడు మురళి.

"అదేంటి ఉన్నట్లుండి భక్తుడైపోయావు. ఏంటి విశేషం" ఆశ్చర్యంగా అడిగాడు వినోద్.

"అవన్నీ మానేసి నీ అభిప్రాయం చెప్పు" అంటూ కాఫీకప్ చేతిలోకి తీసుకున్నాడు మురళి.

"దేవ సన్నిధిలో మనశ్శాంతి లభిస్తుంది. ఇందులో ఎవరికీ అనుమానం లేదు. ఇక నమ్మకమనేది వారి వారి మనసులను బట్టి ఉంటుంది. ఇంతకూ అసలు సంగతేంటి" కాఫీ గుటకేస్తూ పలికారు వినోద్.

***

నిరుపేద జీవితం నుండి వృద్ధిలోకి వచ్చాడు మురళి. తండ్రి లేకపోయినా తనను ఇంతవాడ్ని చేసిన తల్లిపై భక్తి గౌరవాలు ఎక్కువ. ఒక్కగానొక్క చెల్లి. పార్వతిని గారాబంగా చూసుకునే వాడు. ఉన్నంతలోనే పార్వతి పెళ్లి జరిపించి తన బాధ్యత తీరిందని తృప్తి పడ్డాడు.

చిన్నప్పటి నుండి మురళికి భక్తి ఎక్కువ. "చేసేది చిన్న ఉద్యోగమైనా నేను సుఖంగా బ్రతకగలుగుతున్నానంటే అంతా దేవుని దయ" అని నమ్మేవాడు. ఏడాదికొక్కసారి శని త్రయోదశినాడు శనీశ్వరునికి తైలాభిషేకం జరిపించేవాడు.

పార్వతి భర్త నీలకంఠం చిన్న వ్యాపారం చేసే వాడు.

అదేమోగానీ ఇటీవల రెండేళ్ల నుండి ఏ పని చేసినా నష్టమే వస్తోంది. పూజలు, గ్రహశాంతులు చెప్పినవన్నీ చేశాడు. కానీ నీలకంఠం స్థితి మాత్రం బాగుపడలేదు.

"పార్వతీ! శనిత్రయోదశినాడు శనీశ్వరునికి తైలాభిషేకం చేయించండమ్మా. తప్పకుండా మీకు మేలు జరుగుతుంది" చెల్లికి సలహా ఇచ్చాడు మురళి.

ఆ రోజు శనిత్రయోదశి. నవగ్రహ పూజలు జరిపించాడు నీలకంఠం. ప్రత్యేకించి శనికి తైలాభిషేకం చేయించాడు. ఆ రోజు సాయంత్రం ఐదు గంటల సమయంలో...

"అన్నా నీలకంఠం. బాంకులో లోను తీసుకున్నా. బజాజ్ హుడిబాబా బండి బాగుందా" అడిగాడు రాజేష్.

"నీకేమయ్యా! అదృష్టవంతుడివి. ఏమైనా కొంటావు. ఇంకా నెంబరు రాలేదా" అంటూ బైక్ మీద కూర్చుని స్టార్ట్ చేశాడు నీలకంఠం.

"నీకు టి.వి.ఎస్. నడపడమే సరిగా చేతకాదేమో. బండి దిగన్నా" అన్నాడు రాజేష్.

"ఇదీ ఒక బ్రహ్మ విద్యేనా" అంటూ బైక్‌ను ముందుకురికించాడు నీలకంఠం.

"పది నిమిషాలైనా తిరిగి రాలేదు. ఈ మనిషి ఎక్కడైనా కింద పడలేదు కదా" అనుకుంటూ గుబులుగా ఎదురుచూడసాగాడు రాజేష్.

బస్టాండు సర్కిల్ దగ్గర నీలకంఠానికి ఏక్సిడెంట్ జరిగిందట. ఎవరో మాట్లాడుతూ పోతున్నారు.

"బైక్ కొని రెండ్రోజులు కూడా కాలేదు. ఇంకా రిజిష్టర్ చేయించనే లేదు. నలభై వేల రూపాయలు గోవిందా" కాలు ముందుకు వేయలేక పోయాడు రాజేష్.

బావగారికి ఏక్సిడెంట్ జరిగిందని తెలిసిన వెంటనే ఆసుపత్రికి వచ్చాడు మురళి. ప్రాణాపాయం లేదు కానీ మంచి దెబ్బలే తగిలాయి నీలకంఠానికి.

"నీవు చెప్పినట్లే నిన్న శనికి తైలాభిషేకం చేయించాడు. శనీశ్వరుని చూపు మీ బావపై పడింది. అందుకే ఏక్సిడెంట్ జరిగింది. శనికి ప్రత్యేకంగా పూజలు చేయించకపోయినా బాగుండేది. ఇలా జరగకపోను" అంటూ అన్నను చూడగానే బోరున ఏడ్చింది పార్వతి. ఏమనాలో, చెల్లిని ఎలా ఓదార్చాలో అర్థం కాక నిలబడి పోయాడు మురళి.

వారం తర్వాత ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చాడు నీలకంఠం. చెల్లిని వెంటబెట్టుకొని జ్యోతిష్యుని దగ్గరకు వెళ్లాడు మురళి.

"అయ్యా వేదాంతిగారూ! ఉన్న కష్టాలు తొలగిపోవాలని శనికి తైలాభిషేకం చేయిస్తే అసలుకే మోసం వచ్చింది. అసలు లోపం ఎక్కడ జరిగిందంటారు" అడిగాడు మురళి.

"గ్రహదశ సరిగా లేనపుడు ఎవరికైనా కష్టకాలం రాక తప్పదు. కైలాసంలో ఉండాల్సిన పరమేశ్వరుడంతటి వాడే చెట్టుతొర్రలో దాక్కుని కష్టాలననుభవించాడట. సామాన్య మానవులమైన మనమెంత వారం. అయినా శనికి తైలాభిషేకం చేయించి చాలా మంచి పని చేశారు. ఏక్సిడెంట్‌లో ప్రాణం పోవలసిన వాడు గాయాలతో బతికి బయటపడ్డాడు. శనీశ్వరుని అనుగ్రహం ఉంది కాబట్టే అలా జరిగింది" వివరించాడు వేదాంతి. కానీ పార్వతికి మాత్రం నమ్మకం కలుగలేదు.

"శనికి పూజ చేయడం వల్లనే నా భర్తకు ఏక్సిడెంట్ జరిగింది" అంటోంది పార్వతి.

"కాదు ప్రాణగండం తప్పింది శని అనుగ్రహం వల్లనే" అంటాడు వేదాంతి. ఇందులో ఎవరి మాట నిజం. ఏది సత్యం! బుర్ర వేడెక్కిందే కానీ సమాధానం మాత్రం దొరకలేదు.

"ఇదీ సంగతి. అందుకే విషయాన్ని నీ ముందుంచాను" అన్నాడు మురళి.

నా అభిప్రాయం చెప్పాను కదా అన్నట్లు చూశాడు వినోద్.

"ఏది ఏమైనా నీవు చెప్పింది చాలా కరెక్ట్ వినోద్. దేనికైనా మనిషికి నమ్మకం చాలా ముఖ్యం. నా అనుమానం తొలగినట్లే. వెళ్దాం పద" అంటూ పైకి లేచాడు మురళి. నవ్వుకుంటూ మిత్రున్ని అనుసరించాడు వినోద్.



# ఏదిసత్యం

## -టి.రామాంజనేయులు